# జనం గుండెల్లో..గోపన్న

• నియోజకవర్గ అభివృద్ధిలో మాగంటి ప్రత్యేక ముద్ర • శోకసంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు • పార్టీలకతీతంగా నివాళులర్పించిన నేతలు

• జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విషాదం

• అనారోగ్యంతో బీఆర్ఎస్ పార్టీ

## జిల్లా అధ్యక్షుడు కన్నుమూత

బంజారాహిల్స్,జూన్ 8: బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో మృతి చెందడంతో నియోజకవర్గంలో విషాదం నెలకొంది. బస్తీలు, కాలనీల్లో ఎక్కడ చూసినా ఎమ్మెల్యే మాగంటి చిత్రపటాలు ఏర్పాటు చేసిన కార్యకర్తలు నివాళులర్పించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన మాగంటి గోపీనాథ్‌కు మృతితో పార్టీలకు అతీతంగా పలువురు రాజకీయనేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. బీఆర్ఎస్‌లో సాధారణ కార్యకర్తలుగా పనిచేసిన తమకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అండగా నిలబడి కార్పొరేటర్లుగా గెలిపించారంటూ యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్యరావు కన్నీళ్ల పర్యంతమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లనుంచి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వచ్చి మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పించారు. నియోజకవర్గంలో రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న కాంగ్రెస్ నేతలు మహ్మద్ అజారుద్దీన్, నవీన్ యాదవ్, లంకల దీపక్‌రెడ్డి, బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచి పార్టీ మారిన రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్.రెడ్డి, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్ తదితరులు సైతం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పించారు.



హిమాయత్ నగర్‌లోని వై జంక్షన్‌లో గోపీనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

### నివాళులర్పించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థివదేహాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సందర్శించి పుష్పాంజలి ఘటించారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న వెంటనే వారి నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. టీడీపీ హయాం నుంచి బీఆర్ఎస్ వరకు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

### మాగంటి గోపీనాథ్ మృతి పార్టీకి తీరని లోటు

### కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

బండ్లగూడ: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడం చాలా బాధాకరమని రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ పేర్కొన్నారు. ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు అనేక సేవలను అదించారని తెలిపారు.

### మాగంటికి నివాళులర్పించిన నేతలు

బంజారాహిల్స్: జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు.

ఆదివారం ఎమ్మెల్యే మాగంటి మరణవార్త తెలిసిన అనంతరం మన్నె గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి తదితరులు మాదాపూర్‌లోని నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాగంటి పార్థివ దేహానికి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో పాటు డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు.



మాగంటి గోపీనాథ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

### మాగంటి గోపీనాథ్ సేవలు చిరస్మరణీయం

మైలార్‌దేవ్‌పల్లి: నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం కష్టపడిన నాయకుడు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. ఆయన ప్రజా సేవకుడిగా పార్టీకి చేసిన కృషి చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. మైలార్‌దేవ్‌పల్లిలో గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమ శ్రీనివాస్‌గుప్తా, జి.రాజు, ఉప్పల్ శ్రీను, కార్తీక్, భాస్కర్, భూదేవి, సరితా, మహేష్, సునీల్, రాజ్‌కుమార్, బొంబాయి రవి, తిమ్మప్ప, మల్లేష్, రాజు, అమృతమ్మ, మైసమ్మ, శివారెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

### మాఇంటి మాగంటి

జూబ్లీహిల్స్: మాగంటి మరణవార్తతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాలమరణం పార్టీ కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నింపింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి గుండెకాయ లాంటి యూసుఫ్‌గూడ డివిజన్ లో ప్రతి కార్యకర్త మాగంటి నామస్మరణ చేస్తుంటారంటే అతిశయోక్తి కాదు. యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో బీ ఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వెంట నడిచేవారు.
ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను గోపన్న అని పిలుచుకునే కార్యకర్తలను, నేతలను ఆయన తన కుటుంబ సభ్యులుగా చూసుకునే వారు. సంక్షేమ పథకం అందుకునే ప్రతి కార్యకర్తకు ఒక బహుమానం ఇచ్చేవారు. ప్రతి ఇంటిలో మాగంటి బహుమానాలు ఉండడంతో మాగంటికి మా ఇంటి మాగంటి అని పేరు పడింది. ఆదివారం జరిగిన మాగంటి అంత్యక్రియల్లో మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు.

### అంచెలంచెలుగా ఎదిగిన మాగంటి

హిమాయత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం సమాజానికి, పార్టీకి తీరనిలోటని బీఆర్ఎస్ పార్టీ హిమాయత్‌నగర్ డివిజన్ సీనియర్ నేత జె బాబుయాదవ్ అన్నారు. ఆదివారం హిమాయత్ నగర్ వై జంక్షన్ పరిధిలో మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి పలువురు పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపీనాథ్ నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవలు అందించేవారన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణయాదవ్, రఘు, బాబు, కమల్, సత్తార్,శ్రీకాంత్, సత్యనారాయణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### అత్తాపూర్‌లో...

అకాల మరణం చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ఆదివారం హైదర్‌గూడ చౌరస్తాలో సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కొలన్ సుభాష్‌రెడ్డి, చెట్టిగారి నరేందర్(చిన్నా), ఆర్.జంగయ్య, కొండమీది హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, సినీ నటుడు రాజశేఖర్ దంపతులు



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



ఖైరతాబాద్ చౌరస్తాలో మాగంటి గోపీనాథ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు గజ్జెల ఆనంద్ తదితరులు



మైలార్‌దేవ్‌పల్లిలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ తదితరులు



హైదర్‌గూడలో మాగంటి గోపీనాథ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి, చెట్టిగారి నరేందర్ తదితరులు





మాగంటి గోపీనాథ్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మన్నె గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు దేదీప్య రావు, సీఎన్ రెడ్డి తదితరులు

### వేదికల ఏర్పాటుతో ప్రత్యేక ముద్ర

బంజారాహిల్స్,జూన్ 8: గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీని పటిష్టపరిచేందుకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విశేషంగా కృషి చేశారు. భారీ సమావేశాలు, సభలు నిర్వహించడంతో పాటు వేదికల ఏర్పాటులో ప్రత్యేకమైన ముద్రను వేసేవారు. టీడీపీలో పనిచేస్తున్న సమయంలో మహానాడు నిర్వహణలో వేదికల ఏర్పాటు బాధ్యతలు మొత్తం మాగంటి గోపీనాథ్ చూస్తుండేవాడు. తన అనుభవాన్ని ఉపయోగించి బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత కూడా పార్టీ ఆదేశాల మేరకు భారీ సభలు నిర్వహించేవారు. గతంలో కాంగ్రెస్‌పార్టీకి కంచుకోటగా ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మూడున్నర లక్షలదాకా ఓటర్లు ఉంటారు. వారిని ఆకట్టుకునేందుకు వినూత్నమైన థీమ్‌లతో సభలు ఏర్పాటు చేసే మాగంటి గోపీనాథ్‌ను పలు సందర్భాల్లో అప్పటి సీఎం కేసీఆర్ పార్టీ సమావేశాల్లో ప్రశంసించేవారు. కొంపల్లిలో పార్టీ ప్లీనరీ అలంకరణ బాధ్యతలను స్వీకరించిన మాగంటి గోపీనాథ్ ప్రభుత్వ పథకాల నమూనాలతో ఏర్పాటు చేసిన వేదిక, సభా ప్రాంగణం అందరినీ ఆకట్టుకుంది. నెలరోజుల క్రితం జరిగిన పార్టీ ప్లీనరీ సందర్భంగా తెలంగాణ భవన్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దే బాధ్యతను మాగంటి గోపీనాథ్ తీసుకుని ప్రశంసలు దక్కించుకున్నారు. ముంబై నుంచి ప్రత్యేకంగా కళాకారులను పిలిపించి తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కదిలే కటౌట్ ఏర్పాటు చేయించడం అందరినీ అబ్బురపర్చింది.

## ఎర్రమట్టి అమ్ముకుంటున్న రైతులపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్, జూన్ 8 : ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి అమ్ముకుంటున్న పలువురు రైతులపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని మల్కారం,నానాజీపూర్, రాయన్నగూడ,పెద్దషాపూర్, చౌదర్‌గూడ గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా ఎర్రమట్టిని అమ్ముకుంటున్నారు. దీంతో కొందరు వ్యాపారులను కొనుగోలు చేసి జేసీబీల సహాయంతో ప్రభుత్వ భూముల్లో పెద్దపెద్ద గుంతలు తీసి ఎర్రమట్టిని రాత్రికి రాత్రే వివిధ ప్రదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టిని అమ్ముకుంటున్న కొందరు రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



అత్తాపూర్‌లో బడిబాటలో పాల్గొన్న అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నైపుణ్యాన్ని మరింత పెంచుతుందని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెల్లడించారు. ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆదివారం కూడా అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి బడీడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వల్ల జరిగే ఉపయోగాలను తెలియజేశారు. అధునాతన టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం, పిల్లలు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్, ఆట సామగ్రి, విశాలమైన తరగతి గదులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పిస్తారని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్‌లు సైతం ఉచితంగా అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజా రాణి, హేమలత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలు పరిష్కరించాలి


హిమాయత్ నగర్, జూన్ 8: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం హిమాయత్ నగర్ లోని సంఘం కార్యాలయం లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులను కాలరాస్తూ వారికి దక్కాల్సిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందకుండా కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు.దళితులు తమ హక్కులు, చట్టాలను తెలుసుకోనంత కాలం దోపిడీకి గురికాక తప్పదన్నారు.దళితులకు రాజ్యాంగం ఎన్నో హక్కులు కల్పించినప్పటికీ.. నేటికీ వివక్ష కొనసాగుతున్నదని ఆరోపించారు. నగరంలో మూసీ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే దళితులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ



స్కాలర్‌షిప్ చెక్కులు, ఎడ్యుకేషన్ కిట్లను అందుకున్న విద్యార్థులు

ఖైరతాబాద్, జూన్ 8 : వాసవీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం లక్డీకాపూల్‌లోని సేవా కేంద్రం ఆడిటోరియంలో విద్యా సహాయ నిధి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవీదేవి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 400 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు ఎడ్యుకేషనల్ కిట్లను వాసవీ సేవా కేంద్రం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లూరు రమేశ్, నాచం ప్రభాకర్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ సేవా కేంద్రం కోశాధికారి ఇల్లూరి నరేంద్ర కుమార్, పూర్వ అధ్యక్షులు ఆలంపల్లి రవి కుమార్, జీవితకాలపు ముఖ్య సలహాదారులు కొండ్లె మల్లికార్జున్, అశోక్ కుమార్, కానసగొట్టు రాజశేఖర్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



### నూతన కార్యాలయం ప్రారంభం

ఖైరతాబాద్ యాదవ సంఘం నూతన కార్యాలయాన్ని మాజీ కార్పొరేటర్ జి. కృష్ణ యాదవ్, అధ్యక్షుడు కంటెబోయిన కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మానుక పాండు యాదవ్, సలహాదారుడు మంగళారపు లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు మారబోయిన వెంకటేశ్, ఏశబోయిన రాజు యాదవ్, గంగాధర్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయిని వెంకటేశ్, రవీందర్ యాదవ్, మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.-ఖైరతాబాద్.

## ఇండ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కాటేదాన్‌లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 8: ఇండ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఎం పార్టీ ముందుండి పోరాడుతుందని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. ఆదివారం కాటేదాన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జీఎం గట్టయ్య అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పగడాల యాదయ్య, సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు జి.కవితలు హాజరయ్యారు. ముందుగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ సారి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం పెరిగిన ధరలు రోజు రోజుకు పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. మరోపక్క బడాపెట్టు బడిదారి కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయలు రాయితీలిస్తూ రైతులను మాత్రం వేధిస్తుందన్నారు. కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి శ్రమదోపిడీకి గురి చేస్తుందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రతిపక్షాలను తిడుతూ కాలయాపన చేస్తున్నారన్నారు.

### కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు

రాజేంద్రనగర్ మండలం శంషాబాద్ మండలంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు కాజేస్తూ వారికి తొత్తులుగా ఉన్న వారికి అప్పజెప్తున్నా చూసీ చూడట్లుగా అధికారుల తీరు కనిపిస్తుందన్నారు. పైకి మాత్రం హైడ్రా పేరుతో హల్‌చల్ చేస్తూ కనిపిస్తుందన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడి ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు.

## రోడ్డును ఆక్రమించి నిర్మాణం

దుండిగల్ : రోడ్డును ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు కొందరు అక్రమార్కులు. ఇదేమని అడ్డగించిన స్థానికులపై చిందులు వేస్తున్నారు. పైగా తమకు పొలిటికల్ అండదండలు ఉన్నాయి.. అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. వివరాల్లోకి వెళ్తే .. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 15వ డివిజన్, రాజీవ్‌గాంధీ నగర్‌లోని మజీద్ రోడ్డులో ఓ వ్యక్తి తనకున్న 100 గజాల స్థలంలో ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. అయితే మెట్లు నిర్మాణం కోసం 5 ఫీట్లరోడ్డు స్థలాన్ని ఆక్రమించి పిల్లర్లు వేసేందుకు ప్రయత్నిస్తుండగా, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించగా.. అంతా మా ఇష్టం ఏం చేసుకుంటారో చేసుకోండి.. అంటూ స్థానికులతో వాగ్వాదానికి దిగారు. గతం లో ఎంతవరకైతే నిర్మాణం ఉందో అంతవరకు నిర్మాణం చేపడితే ఎవరికీ అభ్యంతరం లేదని స్థానికులు చెప్పినప్పటికీ నిర్మాణదారులు ఎవరి మాటలు వినకుండా పెడచెవిన పెడుతూ తమ పని కానిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఫిట్ తెలంగాణ కోసం..

ఆరోగ్యవంతమైన తెలంగాణే లక్ష్యంగా సొసైటీ ఆఫ్ తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ మార్గ్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఆవరణలో 3కే, 5కే, 10కే, హాఫ్ మారథాన్ విభాగాల్లో అవగాహన రన్ను నిర్వహించారు. ఈ రన్నుకు ముఖ్య అతిథులుగా హాజరైన ఒలంపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు ఏపీ జితేందర్ రెడ్డి, డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహా మండలి సభ్యులు డాక్టర్ ఎ. రామ్ కిషన్, అవంతిక కన్‌స్ట్రక్షన్ ఎండీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ ప్రతినిధులు డాక్టర్ సోమ జగన్ మోహన్ రెడ్డి, పన్నాల హరిశ్చంద్ర రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ తాగూరి, రవి, రాజు, సతీశ్, సునీల్, ఆధిత్యదేవి తదితరులు పాల్గొన్నారు. – ఖైరతాబాద్

